

చీనీ టన్ను రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి.



టమాట కిలో రూ.14

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.14 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 42.7°/23.5°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వడ గాల్పుల తీవ్రత పెరిగింది. గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ వి.వినోద్ కుమార్ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీరాముని చల్లని దీవెనలతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో జిల్లా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో ఆనంద మయ జీవితం గడపాలని కోరుకున్నారు.

22 నుంచి టీసీసీ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: టీసీసీ–2024 (టెక్నికల్ సర్టిఫికేట్ కోర్స్) డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈనెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ వరలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

అందుబాటులో 2023- ఉత్తీర్ణత సర్టిఫికెట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్(టీటీసీ)–2023 డిసెంబరులో జరిగిన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ పరీక్షలకు సంబంధించి ఉత్తీర్ణత సాధించిన వారి సర్టిఫికెట్లు అందుబాటులోకి వచ్చాయని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష హాల్‌టికెట్, ఫలితాల కాపీలతో పాటు ఆధార్‌కార్డు తీసుకుని అనంతపురం కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలో సంప్రదించి సర్టిఫికెట్లు పొందాలని డీఈఓ సూచించారు.

నేడు ఎన్నికల పరిశీలకుల రాక

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల పరిశీలకులు జిల్లాకు బుధవారం విచ్చేయనున్నారు. రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం పరిశీలకుడిగా అజయ్‌నాథ్, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అర్బన్ పరిశీలకుడిగా శివంవర్మ, రాప్తాడు పరిశీలకుడిగా దీపక్ రామచంద్ర తవారేను భారత ఎన్నికల కమిషన్ నియమించింది. జిల్లాకు చేరుకున్న అనంతరం ఎన్నికల నిర్వహణ అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించడంతో పాటు నియోజకవర్గాల్లో పర్యటిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

20,21 తేదీల్లో వర్ష సూచన



బుక్కరాయసముద్రం: జిల్లాలో ఈ నెల 20, 21 తేదీల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వాతావరణ కేంద్రం నుంచి సమాచారం అందిందన్నారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 40.6–42.5, రాత్రి ఉష్ణోగ్రతలు 27.1–27.6 డిగ్రీల నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 48–56 శాతం, మధ్యాహ్నం 23–28 శాతంగా నమోదవుతుందన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

అనంతపురం అర్బన్: జిల్లాలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. తాగునీరు, ఉపాధి పనులు, తదితర అంశాలపై సీఎస్ మంగళవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో సమీక్షించి తగిన సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్,డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పుట్లూరు మండలం పరిధిలోని తొమ్మిది గ్రామాలు, బుక్కరాయ సముద్రం మండలంలోని ఒక గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని చెప్పారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పుట్లూరు, బుక్క రాయసముద్రం మండలాల్లో నీటి సంరక్షణ పనులు చేపట్టాలన్నారు. వేసవి కార్యాచరణ ప్రణాళిక మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అమృత్ సరోవర్ పనులు వారంలోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గుమ్మఘట్ట–కోనాపురం

4 కిలోమీటర్లు | రూ.2.50 కోట్లు




గుత్తి 22వ వార్డు సీసీ రోడ్డు

రూ.20 లక్షలు



కైరేవు–చెర్లోపల్లి

2.5 కి.మీ | రూ.1.50 కోట్లు



వజ్రకరూరు–చాబాల

10 కి.మీ | రూ.3.4 కోట్లు

ప్రగతి బాటలు



చూసేందుకు సుందరంగా, వాహనాలు రయ్‌మంటూ దూసుకెళ్లేలా ఉన్న ఈ రోడ్లన్నీ ఒకప్పుడు అధ్వానానికి పరాకాష్టగా ఉండేవి. అభివృద్ధికి చిహ్నాలుగా భావించే రహదారులను బాగు చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల చేయలేదు. దీంతో జిల్లాలోని చాలా చోట్ల రహదారులు అడుగడుగునా గుంతలు తేలి ఉండేవి. ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపించేవి. ఈ విషయాన్ని అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రజలు విన్నవించినా పట్టించుకోలేదు. కానీ, అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. అధికారంలోకి రాగానే 'దారి'ద్ర్యాన్ని పారదోలారు. రూ. వందల కోట్లు వెచ్చించి రహదారులను బాగు చేయించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున సిమెంటు రోడ్లు నిర్మించారు. ప్రయాణం సాఫీగా సాగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

గుంతకల్లు ఆర్డీటీ కార్యాలయం– దోనిముక్కల బైపాస్ 6 కి.మీ | రూ.3.80 కోట్లు



దుద్దేకుంట–కోనంపల్లి

6 కి.మీ | రూ.2.4 కోట్లు



బీకేఎస్ సెంట్రల్ జైలు– జంతలూరు

3 కి.మీ | రూ.4 కోట్లు



ఇరువెందల రోడ్డు–నాయనవారిపల్లి

2 కి.మీ | రూ.1.36 కోట్లు



తాడిపత్రి ఫ్లైఓవర్– కడప రోడ్డు

5 కి.మీ | రూ.20 కోట్లు



పండమేరు రైల్వే బ్రిడ్జి–పంచాయతీ కార్యాలయం

1.5 కి.మీ | రూ.2.3 కోట్లు



చిట్టూరు–కొండూరు

8.7 కి.మీ | రూ.3.2 కోట్లు



యాడికి మండలం నిట్టూరుకు

1 కి.మీ | రూ.20 లక్షలు



కణేకల్లు–అంబాపురం

2 కి.మీ | రూ.1.46 కోట్లు

ఇక.. మరింత రసవత్తరం

- రేపటి నుంచే నామినేషన్ల ఘట్టం
- నోటిఫికేషన్ విడుదల చేయనున్న ఆర్‌ఓలు
- 25 వరకూ నామినేషన్ల స్వీకరణ
- 26న పరిశీలన, ఉపసంహరణకు 29 వరకూ గడువు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల సమరం మరింత రసవత్తరంగా మారనుంది. ఎన్నికల ప్రక్రియలో తొలి అంకమైన నామినేషన్ల ఘట్టం ఈ నెల 18 నుంచి ప్రారంభం కానుంది. నామినేషన్ ప్రక్రియ ప్రారంభానికి ముందు 11 గంటలలోపు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్‌ను పార్లమెంట్, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులు ఫారం–1లో ప్రచురించనున్నారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ ప్రక్రియ వీడియో తీస్తారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 25వ తేదీ ఆఖరు. 26న నామినేషన్ పత్రాల పరిశీలన ఉంటుంది. ఉపసంహరణకు 29 వరకూ గడువు నిర్దేశించారు. మే నెల 13న పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారు. జూన్ 6తో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగుస్తుంది.

ఆర్‌ఓ కార్యాలయాల్లో నామినేషన్

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వ్యవహరిస్తారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ రమేష్‌రెడ్డి ఉంటారు. పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు కలెక్టరేట్‌లోని ఆర్‌ఓ చాంబర్‌లో నామినేషన్ దాఖలు చేయాలి. ఇక శాసనసభకు పోటీ చేసే అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల వద్ద నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆర్‌డీఓలు రిటర్నింగ్ అధికారులుగా ఉన్న అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి నియోజకవర్గాల్లో సంబంధిత ఆర్‌డీఓ కార్యాలయాల్లో నామినేషన్లు దాఖలు చేయాలి. మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించి నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దారు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ఆర్‌ఓ చాంబర్

కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ చాంబర్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు.

ఐదుగురికే అనుమతి..

ఆర్‌ఓ కార్యాలయం ప్రహరీ నుంచి వంద మీటర్ల లోపలికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు. అభ్యర్థి, అభ్యర్థి ఎన్నికల ఏజెంట్, ప్రతిపాదకుడు, అభ్యర్థి ప్రతిపాదించిన ఇద్దరు వ్యక్తులకు మాత్రమే లోపలికి ప్రవేశం ఉంటుంది.

వివరాలు సరిచూసుకోవాలి

నామినేషన్ కోసం నిర్దేశించిన ఫారంలో అభ్యర్థులు వివరాలను నింపాలి. వివరాలు ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకున్న తరువాత నామినేషన్ దాఖలు చేయాలి. పార్లమెంట్ అభ్యర్థులకు సంబంధించి సాధారణ వ్యక్తులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.12,500 డిపాజిట్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అసెంబ్లీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్ మొత్తం చెల్లించాలి. డిపాజిట్ సొమ్మును ఆర్‌ఓ వద్ద నగదు రూపంలో చెల్లించి రసీదు పొందవచ్చు, లేదా ట్రెజరీలో చెల్లించి రసీదు తీసుకోవచ్చు. నామినేషన్ వేసిన అభ్యర్థులతో ఆర్‌ఓలు ప్రమాణం తీసుకుంటారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

అనంతపురం అర్బన్: ''సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. జిల్లా యంత్రాంగానికి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు సంపూర్ణ సహకారం అందించాలి'' అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లోని ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం–12 ఇచ్చామన్నారు. అత్యవసర సేవలు అందించే 33 శాఖలకు చెందిన ఉద్యోగులకూ పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్ల మొదటి రాండమైజేషన్ పూర్తి చేసి నియోజకవర్గాలకు తరలించి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామన్నారు. ఈనెల 14 వరకూ అందిన ఫారం–6, ఫారం–8 దరఖాస్తులను 25వ తేదీలోగా పరిష్కరిస్తామన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏవైనా సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల వ్యయానికి సంబంధించి జిల్లా, నియోజకవర్గ స్థాయిలో 498 వస్తువులకు రేట్ చార్ట్ ఏర్పాటు చేశామని చెప్పారు.

ఫ్లాగ్‌షిప్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న జరగనున్న ఫ్లాగ్‌షిప్ పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సెషన్లుగా జరిగే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నావెల్ అకాడమీ (ఎన్‌ఏ) పరీక్షకు 187 మంది, మూడు సెషన్లుగా జరిగే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షకు 136 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. కేఎస్ఎన్ ప్రభుత్వ యూజీ, పీజీ బాలికల కళాశాల కేంద్రంగా ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్ష పేపర్–1 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు.జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కేంద్రంగా సీడీఎస్ పరీక్ష పేపర్–1 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, పేపర్–3 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా అధికారులను నియమించామన్నారు. కేంద్రాల వద్ద జామర్లను ఒకరోజు ముందే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జామర్ల ఏర్పాటుకు బీఈఎల్ ప్రతినిధి ఉత్తమ్‌ను యూపీఎస్సీ నియమించిందన్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు నిర్దేశిత సమయం కంటే అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, స్మార్ట్, డిజిటల్ గడియారాలు, పుస్తకాలు అనుమతించమన్నారు. ఈ–అడ్మిట్ కార్డు చూపిస్తేనే కేంద్రాల్లోకి అనుమతిస్తారని స్పష్టం చేశారు.

ఎంటెక్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో నిర్వహించిన ఎంటెక్ ఆర్–21 ఒకటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. అలాగే ఆర్–17 ఒకటి, మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ, ఆర్–21, ఆర్–17 రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ, డిసెంబర్, జనవరి నెలలో నిర్వహించిన ప్రీ పీహెచ్‌డీ (వింటర్ సెషన్) పరీక్ష ఫలితాలూ విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలి



ముగ్గును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో బాధ్యతగా తమ హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో డ్వాక్రా మహిళలకు రంగోళి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎన్నికల అధికారి పాల్గొని, మాట్లాడారు. మే 13న పోలింగ్ ఉంటుందని, ఓటు ఉన్నవారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. కాగా, పోటీల్లో 80 మందికి పైగా మహిళలు పాల్గొని, ఓటు విలువ తెలియజేసేలా ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. వీరిలో మొదటి బహుమతిని పార్వతి, రెండో బహుమతిని ఉమ, మూడో బహుమతిని చంద్రిక గెలుచుకున్నారు. విజేతలకు నగదు పురస్కారాలతో జిల్లా ఎన్నికల అధికారి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.వెంకటేష్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, మెప్మా పీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ శివరామిరెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల మహిళలు పాల్గొన్నారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
WELFARE OF DIFFERENTLY ABLED, TRANSGENDER AND SENIOR CITIZENS
Rc.No. C1/WC/Elections/2024, Dated : 16-04-2024
SHORT TERM TENDER NOTIFICATION

The following Notification have been made for procuring of **576** Wheel Chairs for use of Persons with Disabilities and Senior Citizens in upcoming General Elections to HOP/APLA-2024.

1. Issue of Short Tender	17-04-2024 at 10-30 A.M.
2. Last date for submission of Tenders	20-04-2024 at 3-00 P.M.
3. Short Tender Quotations dropped in Drop Box at	O/o. the Assistant Director, Welfare of Differently Abled, TG & Sr.Citizens, Buddappa Nagar, Ananthapuramu.
4. Opening of Financial Bid	20-04-2024 at 4-00 P.M.
5. Tender Document fees	Rs. 2,000/- (DD will be submitted in favour of Project Officer, TCPC, Ananthapuramu.
6. Place of Opening	O/o. The Assistant Director, Welfare of Differently Abled, TG & Sr.Citizens, Buddappa Nagar, Ananthapuramu.
7. Contact Number	8341928844

Sd/- Collector & District Election Officer, Anantapuramu.

ధనికులతో పేద విద్యార్థుల పోటీ

- నేను అమెరికా నుంచి వచ్చి ఏపీలో స్కూళ్లను చూసినప్పుడు సంతోషం అనిపించింది
- ప్రతి ప్రభుత్వ స్కూలు కూడా మౌలిక సదుపాయాలతో కనిపించింది
- ఆంగ్ల మాధ్యమం బోధించే స్కూళ్లను చూసి ముచ్చటేసింది
- అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి భవిష్యత్ తరాలకు పెట్టుబడి
- ఎంతో ముందుచూపు ఉంటేగానీ ఇలాంటి సంస్కరణలు తీసుకురాలేరు
- ఈ విషయంలో సీఎం వైఎస్ జగన్ చాలా అభినందనీయులు
- 'సాక్షి'తో అమెరికాలోని 'ఇన్‌ఫెర్' కంపెనీ అధినేత భుజాల తిరుమలేంద్రరెడ్డి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'చాలా ఏళ్లుగా రాష్ట్రంలోని పరిస్థితులు చూస్తున్నా. నేను కూడా సాధారణ మధ్య తరగతి రైతు కుటుంబం నుంచే వచ్చాను. తాడిపత్రి నియోజకవర్గం నారాయణరెడ్డి పల్లె నా సొంతూరు. గడిచిన రెండు దశాబ్దాలుగా నేను అమెరికాలో ఉంటున్నా. ఇటీవల అమెరికా నుంచి వచ్చినప్పుడు ఓ విషయాన్ని నేను చాలా స్పష్టంగా గమనించా. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో అత్యంత నిరుపేద పిల్లలు సైతం చదువుల్లో ధనికులతో సమానంగా పోటీ పడుతున్నారు. ఈ మార్పును చాలామంది గమనించకపోయి ఉండొచ్చు. ఓ స్కూలుకు వెళ్లి చూశా. చాలామంది కూలి పనులతో జీవనం సాగించే తల్లిదండ్రుల పిల్లలు అక్కడ ఇంగ్లిష్ మీడియంలో చదువుకుంటున్నారు. ఇంతకంటే మార్పు ఏం కావాలి? ఇలాంటి సంస్కరణలు, మార్పులు తీసుకురావాలంటే చాలా ధైర్యం ఉండాలి. అంకిత భావం ఉండాలి. అన్నిటికీ మించి పేదలపై ప్రేమ, అభిమానం ఉండాలి..ఇవన్నీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో ఉన్నాయనిపించింది' అని అన్నారు భుజాల తిరుమలేంద్రరెడ్డి. ప్రస్తుతం అమెరికాలో ఇన్‌ఫెర్ కంపెనీని స్థాపించి వందల మందికి ఆయన ఉద్యోగాలు కల్పించారు. ఆయన స్థాపించిన ఇన్‌ఫెర్ కంపెనీ అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో ఉన్న కంపెనీల జాబితాలో 18వ ర్యాంకు సాధించింది. ఇటీవల అనంతపురం జిల్లాకు వచ్చినప్పుడు ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.

ఆసక్తి ఉన్నా అవకాశం ఉండేది కాదు

గతంలో చాలామంది పేద విద్యార్థుల్లో చదవాలన్న ఆసక్తి ఉన్నా అవకాశాలు ఉండేవి కావు. ఇప్పుడా అవకాశం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించింది. ప్రైవేట్ పాఠశాలలకు పోటీగా, అంతకు మించిన మౌలిక సదుపాయాలతో మొత్తం ప్రభుత్వ పాఠశాలల కోణాన్ని మార్చింది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ధనికులతో పోటీపడేలా ఆత్మ విశ్వాసాన్ని ఈ ప్రభుత్వం పెంపొందించింది.

ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా

శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని కొన్ని స్కూళ్లను నేను స్వయంగా వెళ్లి చూశా. అక్కడ ఇంగ్లిష్ మీడియంలో బోధన చూశాను. నిజంగా ఈ చదువులు వారిని ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా సిద్ధం చేస్తాయని నా నమ్మకం. ప్రపంచం విధించే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావడానికి అద్భుతమైన అవకాశాన్ని ఈ ప్రభుత్వం కల్పించింది.

తల్లిదండ్రులకు భారం తగ్గింది

మనలాంటి వెనుకబడిన ప్రాంతాల్లో పిల్లల చదువు అనేది తల్లిదండ్రులకు ఆర్థిక భారంగానే ఉంటోంది. కానీ ప్రస్తుత రోజుల్లో ఈ పరిస్థితి నుంచి తల్లిదండ్రులు గట్టెక్కారు. అమ్మఒడి పేరిట డబ్బు వస్తుందన్న ధైర్యం వారిలో చూశాను. పిల్లలను విధిగా స్కూలుకు పంపిస్తున్నారు. ఈ సంస్కరణను ప్రవేశపెట్టే ముందు సీఎం వైఎస్ జగన్ చాలా అధ్యయనం చేశారనిపిస్తోంది. ఇది నిజంగా విప్లవాత్మక సంస్కరణ. జిల్లాలోని మద్దిపల్లి, బొమ్మలాటపల్లి వంటి గ్రామీణ ప్రాంత పాఠశాలలూ సందర్శించా. ఇవి నిజంగా మన ప్రభుత్వ పాఠశాలలేనా అనిపించింది. చూడముచ్చటగా ఉన్నాయి. వీటి ముందు ప్రైవేటు స్కూళ్లు ఎందుకూ పనికిరావనిపించింది. ఇలాంటి వసతులుంటే పిల్లలు ఎన్నటికీ గైర్హాజరు కారు. విద్యా వ్యవస్థలో జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుతమైన సంస్కరణ ఇది అని చెప్పగలను.

ఉన్నత విద్యకు రాచబాట

ఆంధ్రప్రదేశ్‌లో వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ క్రమం తప్పకుండా అందుతోంది. ఇలాంటి పథకం భారతదేశంలో నేను ఎక్కడా చూడలేదు. గతంలో మూడేళ్ల డిగ్రీ కోర్సు చదవలేక ఇక్కట్లు ఎదుర్కొనే చాలామంది విద్యార్థులు నేడు నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సును కాలర్ ఎగరేసి మరీ చదువుతున్నారు. దీనివల్ల స్థిరమైన ఉద్యోగాలు దక్కించుకుంటున్నారు. వారి సామాజిక ఆర్థిక స్థితిగతులే మారిపోతున్నాయి.



గుత్తి ఆర్‌ఎస్‌లో చోరీ

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని అయ్యప్ప స్వామి కాలనీలో నివాసముంటున్న కొలిమి బాషా ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... సోమవారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలసి బాషా తన ఇంటి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలిస్తే బీరువాలోని రూ. 38 వేలు నగదు, రెండు బంగారు చిన్న ఉంగరాలు, ఒక జత కమ్మలు, హుండీలో డబ్బు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

క్వింటా ఎండుమిర్చి రూ.18 వేలు

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఎండుమిర్చి క్వింటా గరిష్ట ధర రూ.18వేలు పలికింది. మార్కెట్‌కు మంగళవారం వంద క్వింటాళ్ల సరుకు వచ్చింది. ఈ–నామ్ ద్వారా వేలం వేయగా కనిష్టం రూ.7,200, గరిష్టం రూ.18వేలుగా పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.

రెడ్డి సోదరులు ఏకం కావాల్సిన సమయమిదే

- ఏపీ రెడ్డి జన సంఘ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రొద్దం సురేష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: ఆరోగ్యశ్రీ, విద్యా దీవెన, రైతులకు ఉచిత విద్యుత్ తదితర పథకాలతో రెడ్డి జాతి కీర్తిని దశదిశలా వ్యాపింప చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హతమార్చేందుకు కొందరు కుట్ర పన్నడం దుర్మార్గమని ఏపీ రెడ్డి జన సంఘ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రొద్దం సురేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ కుటుంబంలో చిచ్చుపెట్టి ఆ ప్రయత్నం ఫలించక పోవడంతో పూర్తిస్థాయిలో వైఎస్ జగన్‌ను అడ్డు తొలగించుకునేందుకు పథకం రచించడం దారుణమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రెడ్డి సోదరులంతా ఐక్యతను చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాతి మొత్తాన్ని విడదీసి నిర్వీర్యం చేసే కుట్ర నుంచి మనల్ని మనం కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

నలుగురి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యల్లో భాగంగా మంగళవారం నలుగురు వలంటీర్లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో రాయదుర్గం మండలం బొందనకల్లు గ్రామానికి చెందిన వలంటీర్లు ఆర్.మంజునాథ్ నాయక్, ఆర్.పాపారాయుడు, బి.భోజరాజు, అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం గ్రామ క్లస్టర్–8 వలంటీర్ కె.అఖిలభాను ఉన్నారు. అలాగే ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు ఇప్పటి వరకూ చేపట్టిన తనిఖీల్లో రూ.2.79 కోట్ల నగదు, ఎస్ఎంఎస్ ద్వారా రూ.16.62 లక్షల విలువ చేసే 8,600 లీటర్ల మద్యం సీజ్ చేశారు.



కీచక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జేసీనే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి రూరల్: టీడీపీలో కామాంధులు ఎక్కువయ్యారని, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించే కీచక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జేసీ ప్రభాకరరెడ్డి అని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఘాటుగా విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలపై అక్రమ కేసులు బనాయించి పైశాచిక ఆనందం పొందడం జేసీ ప్రభాకరరెడ్డి నైజమన్నారు. తాడిపత్రి మండలం వెలమకూరులో బాబాయిని చంపించడమే కాక హతుడి భార్యపై కేసు పెట్టించిన దుర్మార్గాన్ని ప్రజలెవ్వరూ మరిచిపోలేదన్నారు. అలాగే పెద్దవడుగూరు మండలం అప్పెచెర్లలో భాస్కర్‌రెడ్డిని చంపించి మహిళ అని చూడకుండా కేసులు పెట్టించిన నీచ సంస్కృతి జేసీ ప్రభాకరరెడ్డిదన్నారు. జేసీ అనుచరుడు, తాడిపత్రిలోని నందలపాడుకు చెందిన టీడీపీ కౌన్సిలర్ విజయ్‌కుమార్ మహిళలను వేధించిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. గతంలో ఓ మహిళను వేధించిన ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిందన్నారు. ప్రేమ పేరుతో గర్భవతిని చేసి పెళ్లి చేసుకోకుండా తనను వంచించిన కౌన్సిలర్ మల్లికార్జునపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని జేసీ వద్దకు వెళ్లిన యువతిని వెటకారంగా మాట్లాడి అవమానించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జేసీ ప్రభాకరరెడ్డి తనకు అన్యాయం చేయడంతోనే న్యాయం కోసం సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఆ సమయంలో కీచక కౌన్సిలర్‌కు మద్దతుగా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టి యావత్ మహిళాలోకాన్ని అవమానించిన నీచ చరిత్ర జేసీదన్నారు. మహిళలపై సాగించిన అరాచకాల జాబితా తన వద్ద ఉందని, కావాలంటే వాటిని జేసీకి పంపుతానన్నారు. వాహనాల కుంభకోణంలో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయినందుకే జేసీపై పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. ఈ కేసులను విజయవాడ కోర్టులో ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో తాడిపత్రి కోర్టుకు మార్పించుకున్నాడన్నారు. మునిసిపాలిటీలో డీజిల్ దొంగ ఎవరో ప్రజలందరికీ తెలిసిన బహిరంగ రహస్యమన్నారు. యూజీడీలో రాళ్లు, ఇతర సామగ్రి వేసి మురికి నీరు వెళ్లకుండా చేసి వాటిని క్లీన్ చేయకుండా అడ్డుకుంటున్నాడని తనపై విష ప్రచారానికి జేసీ తెరలేపాడని గుర్తు చేశారు. తన సొంత డబ్బు వెచ్చించి దాదాపు రెండు నెలల పాటు కార్మికులతో మరమ్మతులు చేయించానన్నారు. ఈ ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధిపై, గతంలో జేసీ చేసిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతే నాయకులు, మద్దతుదారులను వదిలి హైదరాబాద్, ఊటీ వెళ్లిపోతానని జేసీ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జేసీ అరాచకాలను ఎదుర్కొనేందుకు తాను తాడిపత్రిలోనే ఉంటానన్నారు. అందుకే తాడిపత్రిలో సొంత ఇల్లు కూడా కట్టించుకున్నట్లు తెలిపారు.

మే 1 నుంచి ఆర్డీటీ సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌లు

అనంతపురం: ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.మధుఆచారి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 సబ్‌సెంటర్లలో కోచింగ్ క్యాంప్‌లు ఉంటాయి. మే 1 నుంచి 21వ తేదీ వరకూ ఈ శిబిరాలు నిర్వహిస్తారు. 8 నుంచి 16 సంవత్సరాల వయసున్న బాలబాలికలకు ఉచిత శిక్షణ ఇస్తారు. ఆసక్తి ఉన్న వారు ఆయా కోచ్‌ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి.

సెంటర్	కోచ్	ఫోన్ నంబర్
అనంతపురం (పీటీసీ)	టీవీ చంద్రమోహన్‌రెడ్డి	94402 43600
అనంతపురం(ఎస్ఎస్‌బీఎన్)	పి.శర్మాస్‌వలి	91779 48117
అనంతపురం(ఆర్డీటీ)	ఆర్.ప్రవీణ్	63053 94530
ఆత్మకూరు	అహమ్మద్ రఫీ	62810 44454
బీకేఎస్	సి.వెంకటేష్	94414 89422
గుంతకల్లు (రైల్వే)	గులాం చాంద్‌బాషా	9885047063
	షోయబ్	95026 21711
గుంతకల్లు (ఎస్‌జేపీ స్కూల్)	ఇనాయతుల్లా	97014 35534
గుత్తి	రాఘవేంద్ర	93989 12588
కణేకల్లు	గోపాలరెడ్డి	77801 36299
	పురుషోత్తం రెడ్డి	83281 82794
కళ్యాణదుర్గం	జి.హరినాథరెడ్డి	99853 44127
నార్పల	పి.మహేశ్వర్	90000 32600
తాడిపత్రి	టి.జయభార్గవ్	93476 40651

బీఎస్‌ఎఫ్ అధికారులతో ఎస్పీ సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దర్

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన కేంద్ర భద్రతా బలగాల (బీఎస్ఎఫ్) అధికారులతో ఎస్పీ అమిత్‌బర్దర్ మంగళవారం సమావేశమయ్యారు. ఓటర్లలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా ఫ్లాగ్‌మార్చ్, రూట్ మార్చ్, వెహికల్ చెకింగ్‌లతో పాటు ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూం సెక్యూరిటీ విధులను సమీక్షించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యమని, ఆ దిశగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించడానికి సమష్టిగా కృషి చేద్దామని కోరారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్.విజయభాస్కర రెడ్డి, ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లాకు కేటాయించిన మూడు బీఎస్ఎఫ్ కంపెనీలకు చెందిన కమాండెంట్ కేఏస్ నాటియల్, ఏసీలు ధర్మేంద్ర సింగ్, సంతోష్ భట్, డీసీ ఎస్ఎస్ శైయని, సీఐలు సతీష్ బలసో, కేదార్మల్ చౌదరి, సంతోష్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా పాఠశాలలో చొరబడితే నేరమే

రాప్తాడు రూరల్: బాలబాలికలు చదువుకునే స్కూళ్లలోకి ముందస్తు అనుమతుల్లేకుండా బయట వ్యక్తులు ఎలా వస్తారని ఎస్పీ అమిత్ బర్దర్ అసహనం వ్యక్తంచేశారు. పాఠశాలలోకి అక్రమంగా చొరబడడమే కాకుండా ఫొటోలు తీయడం నేరమవుతుందని పేర్కొన్నారు. పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలసి అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు మంగళవారం ఎస్పీని కలిశారు. ఓ దిన పత్రిక (సాక్షి కాదు) విలేకరి మల్లేష్ ముందస్తు అనుమతి లేకుండా పాఠశాలలోకి చొరబడి ఫొటోలు తీసి తమను వేధించిన తీరుపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పాఠశాలల్లోకి వస్తూవస్తునే మహిళా టీచర్లు, విద్యార్థినులు గదుల్లోకి, రికార్డు రూమ్‌లోకి వెళ్లి బలవంతంగా ఫొటోలు తీస్తూ బ్లాక్‌మెయిల్‌కు దిగాడని వివరించారు. అంతటితో ఆగకుండా తాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో పెట్టి డబ్బు డిమాండ్ చేస్తున్నాడని వాపోయారు. తమలో ఆత్మస్థైర్యం లోపించేలా పరీక్ష జరుగుతున్న సమయంలో వచ్చి బెదిరింపులకు దిగాడని ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ ఇలాంటి ఘటనలను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్పీని కలిసిన వారిలో వైఎస్సార్‌టీఏ నాయకులు అశోక్‌కుమార్‌రెడ్డి, గోవిందరెడ్డి, గిరిజన ఉపాధ్యాయ సంఘం అశోక్‌నాయక్, గుజ్జల శివయ్య, పీడీ అసోసియేషన్ నరసింహారెడ్డి, తాటిచెర్ల హెచ్ఎం రామ్‌కుమార్, టీచర్లు శారద, హలీమాబీ, రేష్మాబేగం, యుగంధర్, గంగాధర్, ప్రకాష్‌రెడ్డి, రియాజ్ హుస్సేన్, అంజలి తదితరులు ఉన్నారు.

నిర్భయంగా ఓటు వేస్తాను



ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా ఓటు హక్కు వినియోగంపై మంగళవారం కలెక్టరేట్‌లో సంతకాల ద్వారా ప్రచార కార్యక్రమం చేపట్టారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ తొలి సంతకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో పౌరులందరూ భాగస్వాములు కావాలన్నారు. నిజాయితీతో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్య విలువలు కాపాడబడుతాయన్నారు. 'ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగకుండా సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాను' అంటూ ప్రతి ఒక్కరూ సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, రాణిసుస్మిత, వి.శ్రీనివాసులురెడ్డి, కరుణకుమారి, వసంతబాబు, రాంభూపాల్ రెడ్డి, వెన్నెల శ్రీను, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఉద్యోగులు పాల్గొని సంతకాలు చేశారు.

టీడీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగి



టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రికార్డ్ అసిస్టెంట్ రమేష్ (బాణం గుర్తు)

కంబదూరు: మండలంలోని మర్రిమాకులపల్లి పంచాయతీలో ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు తనయుడు చేపట్టిన కార్యక్రమంలో అచ్చంపల్లికి చెందిన రమేష్ పాల్గొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం ప్రభుత్వ పాఠశాలలో ఆయన రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. టీడీపీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొనడం చర్చనీయాంశమైంది.

బీసీల అభ్యున్నతి సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్



మాట్లాడుతున్న రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో బీసీ అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమైందని, ఈ ఐదేళ్ల పాలనలో ఈ అంశం స్పష్టమైందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వివిధ కుల సంఘాల నాయకులతో కలసి ఆయన సమావేశమై మాట్లాడారు. బీసీల ఎదుగుదలకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ గెలుపే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కులవృత్తులకే పరిమితమైన బీసీలను అన్ని రంగాల్లో ఎదిగేలా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దన్నారు. 25 మంది మంత్రివర్గంలో 11 మంది బీసీలకు అవకాశం కల్పించడం చరిత్రాత్మకమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 మంది మునిసిపల్ చైర్మన్లు ఉంటే అందులో 44 మంది బీసీలే ఉన్నారన్నారు. 14 మేయర్ పదవుల్లో 9 మంది, 13 జెడ్పీ చైర్మన్లలో ఆరుగురు, 44 మంది ఎమ్మెల్సీల్లో 30 మంది, 637 ఎంపీపీల్లో 237 మంది బీసీలే ఉన్నారన్నారు. 135 కార్పొరేషన్లలో 55 స్థానాల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే చైర్మన్లుగా కొనసాగుతున్నారన్నారు. నవరత్నాల పథకాలతో రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు రూ.2.55 లక్షల కోట్లు విడుదల చేస్తే అందులో రూ.1.26 లక్షల కోట్లు బీసీల ఖాతాల్లో జమ అయిందన్నారు. మహాత్మ జ్యోతీరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సిద్ధించేలా చేసిన సీఎం వైఎస్ జగన్‌కు అందరూ అండగా నిలవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఎస్.నారాయణస్వామి, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎ.నవీన్‌కుమార్, జిల్లా వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎం.శివకుమార్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోనాల రఫీ, మేదర సంఘం నాయకులు కాకర్ల మేదర కృష్ణయ్య, ఈడిగ గౌడ సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌గౌడ్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బెస్త వెంకటేశ్, వాల్మీకి యువజన విభాగం నాయకులు కిరణ్, బాజీ, మైనార్టీ నాయకులు కట్టుబడి తానీష, హిదయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం



మాట్లాడుతున్న అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ సుబ్రహ్మణ్యం

రాప్తాడు: ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓ కీలక పాత్ర కీలకమని అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓకు పూర్తి అధికారాలు ఉంటాయన్నారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ప్రతి చోట పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్ పోల్ నిర్వహించాలన్నారు. మాక్ పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేసి, వీవీ ప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు.

ఎంపీ రంగయ్యను విమర్శిస్తే సహించం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వాల్మీకి నాయకులు

ఆత్మకూరు: గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కాలవ శ్రీనివాసులు బోయ కులస్తులకు చేసిందేమి లేదు. పెత్తందార్ల చెప్పుడు మాటలు వింటూ ఎంపీ రంగయ్యను విమర్శిస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ వాల్మీకి నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఆత్మకూరులోని వాల్మీకి విగ్రహం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. ఏనాడైనా వాల్మీకుల సమస్యలపై పోరాడావా అంటూ కాలవను ప్రశ్నించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఎంపీ రంగయ్య పోరాడారని గుర్తు చేశారు. ఎంపీ రంగయ్య వన్‌మెన్ కమిటీ వేసి వాల్మీకుల స్థితిగతులను అధ్యయనం చేశారని తెలిపారు. కళ్యాణదుర్గంలో రంగయ్యను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించి కాలవకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బంధూక మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి సోము, వెంకటేష్, రామాంజి, ప్రసాద్, రామాంజనేయులు పాల్గొన్నారు.

13 మంది వలంటీర్ల రాజీనామా

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లి సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 13 మంది వలంటీర్లు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వలంటీర్లు గొర్ల చందన, ఉమామహేశ్వరిచ మమత, అంజలి, నవిత, శిరిష, మమతమ్మ, మహేశ్, శ్యామ్ కుమార్, అనిల్ కుమార్, మహేశ్, భరత్ అలీ, రమేష్ తదితరులు ఎంపీడీఓ గీతావాణికి రాజీనామా పత్రాలు అందజేశారు. టీడీపీ ప్రోద్బలంతో నిమ్మగడ్డ రమేష్ వలంటీర్లను ప్రజా సేవ చేయకుండా అడ్డుకున్నందుకు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నామన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవడానికి జగనన్న సైనికులుగా మారుతామని స్పష్టం చేశారు.

నేడు 6వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 6వ డివిజన్‌లో బుధవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లో వేణుగోపాల్‌నగర్ నాగులకట్ట నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నీటి సమస్య పరిష్కరించాలి



కలెక్టర్ వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

అనంతపురం అర్బన్: గిరిజన తండాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజన తండాల్లో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తండాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు జి.మల్లికార్జున పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 7వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల ఆశీస్సులు అవసరం ఉండేది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 7వ డివిజన్‌లో అనంతపురం, హిందూపురం నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ రాగే పరుశురాం, స్థానిక కార్పొరేటర్ బండి నాగమణితో కలసి ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఆ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలును వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలననందించిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలైన ఈ తరహాలో సంక్షేమాన్ని అందించాయా? అని ప్రశ్నించారు. అమ్మఒడి, చేయూత, ఆసరా, తదితర పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాల ఆర్థిక స్థితి మెరుగుపడిందన్నారు. ఖరీదైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించిన విషయాన్ని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. తద్వారా స్పెషాలిటీ వైద్యాన్ని జిల్లా కేంద్రంలోనే అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో ఏదైనా చిన్నపాటి సమస్య వస్తే పక్క జిల్లాలకు పరుగులు తీయాల్సి పరిస్థితులు ఉండేవన్నారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదన్నారు. కార్పొరేట్ స్కూళ్ల తరహాలోనే ప్రభుత్వ పాఠశాలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీర్చిదిద్దారన్నారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే టీడీపీ అడ్డంకులు సృష్టించేలా కోర్టులను ఆశ్రయించిన విషయాన్ని గుర్తు చేశారు.

రూ.1,045 కోట్లతో అభివృద్ధి

నియోజకవర్గంలో రూ.1,045 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతి డివిజన్‌లో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అంతర్గత రోడ్లు, కాలువలను ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రంగన్న, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు సుజాత, జయలలిత, లాలూ, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీదేవి, కృష్ణవేణి, నాయకులు కృష్ణమూర్తి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రాజారత్నం, వనారస బలరాం, దాదాఖలందర్, తనీష, సాకే కుళ్లాయ స్వామి, చింతకుంట మధు, జావెద్, రాధాకృష్ణ, వనారస బలారం, అబ్దుల్, ఏ1రఫి, మిద్దె నగేష్, గౌరి, భారతి, ఉష, డివిజన్ కార్పొరేటర్ బండి నాగమణి, డివిజన్ కన్వీనర్లు నజీర్, తలారి వెంకటరాముడు, చంద్రశేఖర్ రెడ్డి, పావురాల జగదీష్, నగేష్, గోవింద్, జయరామిరెడ్డి, నారాయణ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన పాతూరు వాసులు

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందకొస్తున్నాయి. పాతూరుకు చెందిన షబ్బీర్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన నివాసం వద్ద వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. షబ్బీర్ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, జిల్లా కేంద్రంలో జరిగిన అభివృద్ధికి వారు ఆకర్షితులయ్యారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో మైనార్టీలకు సామాజిక, రాజకీయంగా ఎదిగేలా చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ఎంతో మంది మైనార్టీలకు పదవులు కేటాయించారని తెలిపారు. ఎన్నికల తర్వాత మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్‌ను కోత పెట్టేందుకు బీజేపీ ఆలోచిస్తోందన్నారు. షబ్బీర్ మాట్లాడుతూ.. మతతత్వ పార్టీలకు తాము ఎల్లప్పుడు దూరంగా ఉంటామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఎమ్మెల్యే నాయకత్వాన్ని బలపరుస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మహబూబ్‌బాషా సాహెబ్, షకీల్, బాబావలి, అన్సర్, ఇర్ఫాన్, బాబా హుస్సేన్ తదితరులు ఉరారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్ రహంతుల్లా, ఇసాక్, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, నాయకులు జావెద్, ఏ1రఫి, లోక్‌నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దత్త మందిరంలో పూజలు



సచ్చిదానంద స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: హైదరాబాద్‌లోని దత్త మందిరంలో మంగళవారం బొమ్మెపర్తి గణపతి సచ్చిదానంద స్వామిని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కలిశారు. స్వామి నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం దత్త మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

శిక్ష విధించడంపై హర్షం

అనంతపురం టవర్‌క్లాక్: దొంగతనం చేశారనే నెపంతో దళిత యువకులపై దాడి చేసిన వారికి కోర్టు శిక్ష విధించడం హర్షణీయమని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లన్న అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 28 సంవత్సరాల క్రితం తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం మండలం వెంకటాయపాలెంలో దొంగతనం చేశారన్న కారణంతో ఐదుగురు దళిత యువకులకు శిరోముండనం చేశారన్నారు. ఆ ఘటనపై అప్పట్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారని తెలిపారు. ఆ కేసులో కోర్టు శిక్ష విధించడం సంతోషమన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చటం పటిష్టంగా అమలు పరచినందుకు న్యాయస్థానానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రవిరాజు, చిన్న పెద్దన్న, రమణ, ఆనంద్, రామాంజనేయులు, చంద్రశేఖర్, ఓబులేసు, సత్యమయ్య, సంజీవులు, ప్రకాష్, ఎరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడులో ప్రకాష్‌రెడ్డిదే విజయం



మాట్లాడుతున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: రాప్తాడులో ప్రకాష్‌రెడ్డే విజయం ఖాయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి (చందు) ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచాక ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. రైతులకు ఉచితంగా బోర్లు వేయించినట్లు తెలిపారు. తోపుదుర్తి ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థుల విద్యకు, వైద్యానికి సహాయం చేశామన్నారు. అయితే పరిటాల కుటుంబం మళ్లీ అధికారంలోకి వచ్చి ఫ్యాక్షన్ రాజకీయం చేయాలని చూస్తోందన్నారు. ప్రజలు పరిటాల కుటుంబం, చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. పరిటాల కుటుంబం చెప్పుకోవడానికి ఏ ఒక్క పని చేయలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ప్రకాష్‌రెడ్డి, బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, వైస్ ఎంపీపీ విజయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ మధు, నాగరాజు, మల్లన్న, వెంకట్రాముడు, ఈశ్వరరెడ్డి, వాసుదేవరెడ్డి, జయరామిరెడ్డి, చెన్నారెడ్డి, నాగభూషణం రెడ్డి, సర్దానప్ప, అనిల్, సద్దికూటి శివారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎర్రిస్వామి, నరేంద్ర, విశ్వనాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఓటీ టైలర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


'పరిటాల సునీత చేసిందేమీ లేదు'



ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాప్తాడురూరల్: పరిటాల సునీత పదేళ్ల పాటు మంత్రిగా ఉన్నప్పటికీ ప్రజలకు చేసిందేమి లేదు. ప్రజలకు ఏమి చేశారని ఈరోజు మళ్లీ ఓట్లు అడుగుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం చిన్నంపల్లి పంచాయతీ పరిధిలోని చిన్నంపల్లి, సంతోష్‌నగర్, బీసీ కాలనీ, అన్నేఫెర్రర్ కాలనీ, మటన్‌మార్కెట్, మల్లయ్య కొట్టాల ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పేదలకు జరిగిన సంక్షేమాన్ని నాయకులు వివరించారు. అలాగే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. 30 ఏళ్లగా తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. పరిటాల సునీత మంత్రిగా, ఎమ్మెల్యేగా పని చేసినా ఈ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్య గురించి పట్టించుకోలేదన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన వెంటనే ముఖ్యమంత్రితో మాట్లాడి రూ.110 కోట్లు మంజూరు చేయించారన్నారు. పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలం పాపంపేట వరకు పైపులైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పనులు పూర్తి కాగానే తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా ఇప్పించారన్నారు. ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచులు అంజియాదవ్, సుబ్బిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, నాయకులు పవన్, లక్ష్మీరెడ్డి, చెన్నారెడ్డి, మహానంద రెడ్డి, లోకనాథరెడ్డి, సుంకన్న, ఆదినారాయణ, వెంకటరాముడు, వడ్డే పెద్దన్న, లింగమయ్య, నాగార్జున రెడ్డి, నాగరాజు, తిరుపాల్ రెడ్డి, సుకుమార్, గోవర్ధన్, పెద్దా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

రాప్తాడు: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నియమావళి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించడంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. మండలంలో ఏయే గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయో తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. తాగునీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ఈ రెండు నెలలు ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

- శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తి

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాచలం, ఒంటిమిట్టలో ప్రసిద్ధి చెందిన రామాలయాలను తలపిస్తూ అదే సంప్రదాయంలో సీతారాముల కల్యాణం జరిపించనున్నారు. ఇప్పటికే రామాలయం సర్వాంగ సుందరంగా విద్యుద్దీప కాంతులతో వెలుగులీనుతోంది.

ఇదీ ఆలయ చరిత్ర..

జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన శ్రీ కాశీవిశ్వేశ్వరాలయం ఆలయ చరిత్ర కూడా అంతే ఘనమైంది. 1923లో హోసూరు రామస్వామి అనే భక్తుడు సొంత ఖర్చుతో కాశీ పట్టణానికి నడుచుకుంటూ వెళ్లి అక్కడ నుంచి మహాశివుని లింగాన్ని తెచ్చి ప్రతిష్ఠించారు. 1929లో అదే ప్రాంతం నుంచి తెప్పించిన సీతారాముల సుందర విగ్రహాలు ప్రతిష్ఠ అయినప్పటి నుంచి కన్నుల పండువగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నారు. అదే క్రమంలో రోజుకొక వాహనంపై సీతారాములు పది రోజుల పాటూ నగర వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

అనంతపురం: లాడ్జిల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అనంతపురం డీఎస్పీ జి.వీరరాఘవ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ రెడ్డప్పతో కలిసి నగరంలోని పలు లాడ్జిలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లాడ్జి నిర్వాహకులు, సిబ్బందితో డీఎస్పీ మాట్లాడారు. లాడ్జిల్లోని ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అనుమానస్పద లాడ్జిల్లో బస చేసిన సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. లాడ్జిల్లో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావివ్వొద్దన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే అనంత సమక్షంలో పార్టీలో చేరిన 12వ డివిజన్ యువత

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరికలు పెరుగుతున్నాయి. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో యువకులు పార్టీలోకి చేరారు. నగరంలోని 12వ డివిజన్‌కు చెందిన సయ్యద్ ఖయ్యూం, పీర్ జాహిద్‌బాషా, రోషన్ జమీర్, నూర్‌బాషా, జిలాన్ బాషా, సుభాన్, సమీర్‌తో పాటు వారి మిత్ర బృందానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. యువత పార్టీ పటిష్టకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

అనంతపురం: కళావతమ్మ కాలనీకి చెందిన చెడిపోతుల యోగానంద్ అనే వ్యక్తి మంగళవారం మద్యం విక్రయిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 50 మద్యం బాటిళ్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో మద్యం దుకాణం నుంచి మూడు మద్యం బాటిళ్లు సేకరించి 50 అయ్యాక వాటిని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ ధరణి కిశోర్ తెలిపారు.

అనంత వెంకటరామిరెడ్డి విజయానికి కృషి



ఆజాద్ నగర్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: అనంత అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విజయానికి సమష్టిగా కృషి చేయాలని మేయర్ మహ్మద్ వసీం అన్నారు. మంగళవారం స్థానిక ఆజాద్‌నగర్‌లోని మసీద్ ఏ హసన్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియాజ్ అహమద్, మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ ఖాజా, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆజాద్‌నగర్ ఇషాక్, ఖాదర్‌బాషా, జావీద్, మదర్‌వలి, రఫీ, ఖాదర్‌దొల, షేక్షావలి, కువైట్ ఖాదర్, శర్మాస్, ఇమ్రాన్, షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ కష్టాలే



వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరుతున్న తోపుదుర్తి శైలజా రెడ్డి, గంగుల భానుమతి

రాప్తాడు: టీడీపీకి ఓటు వేసి మళ్లీ కష్టాలు కొనితెచ్చుకోవద్దని వైఎస్సార్‌సీపీ సీనియర్ మహిళ నాయకురాళ్లు తోపుదుర్తి శైలజా రెడ్డి, గంగుల భానుమతి, ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల అన్నారు. మంగళవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని ఆర్‌జేసీ ప్యాలెస్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ముఖ్యమంత్రి జగన్‌పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలే టీడీపీకి బుద్ధి చెప్తారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎల్ఐసీ వెంకటరాముడు, జయన్న, స్థానిక నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రమణా రెడ్డి, మదుసూధన్ రెడ్డి, విజయ్ వర్ధన్ రెడ్డి, మనోహర్, నరేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సనపలో ప్రచారం జోరు..

ఆత్మకూరు: ప్రకాష్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు తోపుదుర్తి శైలజారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సనప గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ రుగుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్న హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, సర్పంచులు ఉజ్జినప్ప, ఓబులేష్, నాయకులు నరసింహులు, భాస్కర్, గోపాల్‌రెడ్డి, ఉమ్మడి భాస్కర్‌రెడ్డి, పోతులయ్య, రామాంజనేయులు, కృష్ణారెడ్డి, యల్లప్ప, అశోక్, తిరుపతయ్య, శీనప్ప, రవి,శ్వరరెడ్డి, శంకర్‌నారాయణరెడ్డి, రామచంద్ర నాయక్, నాగిరెడ్డి, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పంట రుణాల రెన్యూవల్

- మేనేజర్ ప్రదీప్

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ)లో గురువారం నుంచి పంట రుణాలు రెన్యూవల్ చేస్తామని బ్యాంకు మేనేజర్ ప్రదీప్ తెలిపారు. మంగళవారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 18 నుంచి 20 వరకు చాపట్ల, గోళ్లపల్లి, 22 నుంచి 24 వరకు మరూరు, 25, 26 తేదీల్లో ఎం.చెర్లోపల్లి, 26 నుంచి 30 వరకు పర్వతదేవరపల్లి, మే 2 నుంచి 4 వరకు ముక్తాపురం, 6 నుంచి 8 వరకు మామిళ్లపల్లి, 8 నుంచి 10 వరకు కుర్లపల్లి, 15 నుంచి 18 వరకు చంద్రాశ్చర్ల, 27 నుంచి 29 తేదీ వరకు దాదులూరు గ్రామాల రైతుల రుణాలు రెన్యూవల్ చేస్తామని పేర్కొన్నారు. రుణాల రెన్యూవల్‌కు వచ్చే రైతులు భూ రికార్డులతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పుస్తకం జిరాక్స్‌లతో పాటు ఒక పాస్ ఫొటో తీసుకుని రావాలన్నారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

కనగానపల్లి: ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈనెల 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవికిరణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 110 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరందరికీ కనగానపల్లి మోడల్ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి పరీక్ష నిర్వహిస్తామన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి



పోలీసుల కవాతు

రాప్తాడు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని రాప్తాడు సీఐ మునిస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ప్రసన్నాయపల్లి, రాప్తాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో పోలీసులపై నమ్మకం, ధైర్యం నింపడానికే ఈ కవాతు చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాప్తాడు పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాల బృందం తదితరులు పాల్గొన్నారు.